క్లుప్తంగా

హత్య కేసులో భార్యాభర్తలకు జీవిత ఖైదు

ధవళేశ్వరం: హత్య కేసులో భార్యాభర్తలకు జైలు శిక్ష విధిస్తూ 9వ అడిషనల్ జిల్లా కోర్టు జడ్జి ఎం.మాధురి తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే.. ధవళేశ్వరం క్వారీ రోడ్డుకు చెందిన తురుబిల్లి రోహిణి ఇంట్లో అనంతపురానికి చెందిన చెక్కా పవన్ కుమార్, అతడి భార్య కల్లు లక్ష్మి అద్దెకు దిగారు. 2020 జూన్ 26వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో రోహిణిని హత్య చేసి ఆమె మెడలో బంగారు గొలుసు తీసుకొని, అడ్డు వచ్చిన మృతురాలి తల్లిని గాయపరిచి పారిపోయారు. వాదోపవాదనలు అనంతరం హత్యకు పాల్పడిన భార్యాభర్తలకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

విద్యార్థులకు వితరణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జీపీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం కాంపస్ బాక్సులు, బిస్కట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా గొందేశి పూర్ణచంద్రా రెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో చేనేత కార్మికుడు కూర్మా ప్రసాద్ (చిన్నా) నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. హెచ్ఎం నరసింహారెడ్డి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఏసు



రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ యానాపు ఏసు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్ఎస్ఎస్ కార్యకర్త అయిన ఏసు బీజేపీలో రెండు దశాబ్దాలకు సుశిక్షితుడైన కార్యకర్తగా పనిచేస్తున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

సీటీఆర్ఐ: నగరంలో 11 కేవీ లైన్ పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆపరేషన్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- సుబ్బారావునగర్ సబ్ స్టేషన్ పరిధిలోని ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ సరఫరా ఆపివేస్తారు. ఆ సమయంలో సింహాచల నగరం, రామదాసుపేట, సున్నం బట్టీ రోడ్డు, చర్చి కాలనీ, రాజేశ్వరీ నగర్, కొంతమూరు మొయిన్ రోడ్డు, వీసీ కాలనీ, నూకాలమ్మ గుడి ప్రాంతంలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ తాడితోట సబ్‌స్టేషన్ పరిధిలోని కొబ్బరి కాయల మార్కెట్, స్టేడియం రోడ్డు, చెగిడి వీధి, శ్యామలా థియేటర్ వెనుక వైపు, టి.నగర్, అనుశ్రీ థియేటర్ రోడ్డు ప్రాంతాలలో సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

సుగర్ పరీక్షలు



సుగర్ పరీక్షలు జరుపుతున్న బొల్లినేని వైద్య సిబ్బంది

కంబాలచెరువు: వరల్డ్ డయాబెటిక్స్ డే సందర్భంగా గురువారం నగరంలో కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ బొల్లినేని హాస్పిటల్ ఆధ్వర్యంలో మధుమేహ పరీక్షలు నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వర నగర్ వాకర్స్ పార్క్, హ్యాపీ స్ట్రీట్, గౌతమీ ఘాట్ ప్రాంతాలలో ఈ పరీక్షలు జరిపారు. షుగర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే బొల్లినేని హాస్పిటల్స్‌లో అవుట్ పేషెంట్ విభాగంలో రోగుల అటెండర్లకు సుగర్ పరీక్షకులు నిర్వహించారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 18 మంది ఉద్యోగాలకు ప్రాథమిక అర్హత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 60 మంది హాజరవ్వగా వారికి ప్రాథమిక అర్హతగా గ్రూప్ డిస్కషన్ నిర్వహించారన్నారు. వీటిలో అర్హత సాధించిన 18 మందికి మేడిటిక్ టీం లీడర్ అంజుస్ వివరాలు తెలిపి, వారికి రెండో అర్హత పరీక్ష కోసం ఆన్‌లైన్ లింక్ అందజేశారు. దీనిలోనూ అర్హత సాధించిన వారిని ఫైనల్‌గా ఎంపిక చేసి శిక్షణకు పంపిస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల జేకేసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆ నిధులను విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి తదితరులు

సీటీఆర్ఐ: సబ్ కలెక్టర్ కార్యాలయం సమీపంలోని దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీకి కేటాయించిన కోటి రూపాయల నిధులను వెంటనే విడుదల చేసి, గ్యాలరీని అభివృద్ధి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆ గ్యాలరీ ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దామెర్ల రామారావు ఆర్ట్ గ్యాలరీకి గత కమిషనర్ రూ.కోటి మంజూరు చేశారన్నారు. ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు వెంటనే ఆ నిధులను విడుదల చేయాలన్నారు.

చోరీలకు ఇక చెక్..

- అందుబాటులోకి ఎల్‌హెచ్ఎంఎస్
- పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత సేవ
- ఇంటిలో కెమెరాల ఏర్పాటు
- నిరంతర పర్యవేక్షణ





లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ పరికరాలు

కంబాలచెరువు: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నడుస్తోంది. కార్తిక మాసం సందర్భంగా వనసమారాధనల హడావుడి మొదలైంది. అలాగే పుణ్యక్షేత్రాల సందర్శనకు కూడా ఇదే అనువైన సమయం. అయ్యప్ప స్వామి మాలధారులు శబరిమలకు పయనమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. కానీ ఇంటికి వదిలేసి ఊరెళ్లడానికి చాలామంది భయపడుతున్నారు. ఎందుకంటే తాళాలు వేసి ఉన్న ఇళ్లకు టార్గెట్‌గా చేసుకుని కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారు. అయితే ఇక అలాంటి భయాలను వదిలేయవచ్చు. దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) అనే సాంకేతిక వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు.

పనిచేసే విధానం

వైర్‌లెస్ మోషన్ సీసీ కెమెరాలు, యూపీఎస్, డాటా కార్డుతో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్ఎంఎస్) పనిచేస్తుంది. మన ఇంటిలోని కదలికలన్నీ పూర్తిగా రికార్డు చేస్తుంది. ఎవరైనా ఊరు వెళుతున్నప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చి ఎల్‌హెచ్ఎంఎస్‌ను అమర్చమని కోరాలి. వారు వెంటనే వచ్చి ఆ పరికరాన్ని మన ఇంట్లో ఏర్పాటు చేస్తారు. దాన్ని ఆ ప్రాంతంలోని పోలీసు స్టేషన్‌కు, ఇంటి యజమాని మొబైల్ ఫోన్‌కు అనుసంధానం చేస్తారు. అలాగే పోలీసు స్టేషన్‌లో అలారం అమర్చుతారు. పోలీసు సిబ్బంది స్టేషన్‌లోని మానిటర్‌లో ఆ ఇంటిని గమనిస్తూ ఉంటారు.

కెమెరా నిఘా

మనం ఊరు వెళ్లిన తర్వాత దొంగలు ఇంటిలోకి వస్తే అప్పటికే ఏర్పాటు చేసిన కెమెరాలో రికార్డు అవుతారు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అలారం మోగుతుంది. ఎల్‌హెచ్ఎంఎస్ సీసీ పుటేజీ ద్వారా ఆ ఇంటి వద్దకు ఎవరు వచ్చారు, ఎంతమంది వచ్చారనే విషయాలను పోలీసులు పరిశీలిస్తారు. అనంతరం అక్కడకు చేరుకుని దొంగలను పట్టుకుంటారు.

అందుబాటులో..

ఎల్‌హెచ్ఎంఎస్ యాప్ గూగుల్ ప్లేస్టర్‌లో అందుబాటులో ఉంటుంది. దాన్ని ఆండ్రాయిడ్ ఫోన్‌లోకి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇంటి యజమాని పేరు, ఇంటి నంబరు, ఫోన్ నంబరుతో రిజిస్ట్రేషన్ అవ్వాలి. అనంతరం ఓటీపీ నంబరుతో యూజర్ ఐడీ వస్తుంది. ఎప్పుడైనా ఊళ్లకు, యాత్రలకు వెళ్తున్నప్పుడు దాని ద్వారా రిక్వెస్ట్ ఇవ్వాలి. ఫలానా రోజుల్లో ఇంట్లో ఉండడం లేదని సమాచారం తెలిపితే పోలీసు అధికారులు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. మీరు తిరిగి వచ్చేంతవరకూ ఆ ఇంటిపై నిఘా ఉంచుతారు. ఈ సేవ అవసరమైన నగర ప్రజలు 94932 06371, 99084 54580 నంబర్లను సంప్రదించవచ్చు.

ఎల్‌హెచ్ఎంఎస్ సేవ ఉచితమే



ఎల్‌హెచ్ఎంఎస్‌పై ప్రజలు అవగాహన పెంచుకోవాలి. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లేవారు దీన్ని ఉపయోగించుకోవాలి. ఈ సర్వీసులు పోలీసు శాఖ ద్వారా ఉచితంగానే అందజేస్తున్నాం. దీనికోసం రూపాయి కూడా కట్టనవసరం లేదు. దొంగతనాలను పూర్తిస్థాయిలో నిరోధించడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది. ఈ సేవ కావాలనుకునే వారి ఇంటికి మా టెక్నీషియన్ వచ్చి కెమెరాను అమర్చి వెళతారు. ఎన్ని రోజులైనా సరే ఉచితంగా వినియోగించుకోవచ్చు.

– వై.రాంబాబు, సీఐ, త్రీటౌన్ క్రైం స్టేషన్, రాజమహేంద్రవరం

ముంపు నివారణకే ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గ్రామీణ ప్రాంతాల్లోని డ్రైనేజీలు, రహదారులపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆమె గురువారం హుకుంపేట, బాలాజీ పేటలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆవ డ్రెయిన్ పరిధిలోని 6.39 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించామన్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. దీని నివారణలో భాగంగా ఆక్రమణలను తొలగించడం, డ్రైనేజీల క్రమబద్ధీకరణ, సిల్ట్ తొలగింపు పనులను ఇప్పటికే చేపట్టామన్నారు. గతంలో ఈ ప్రాంతంలో పర్యటించి పలువురికి నోటీసులు ఇచ్చామన్నారు. ఆవ చానల్ డ్రైనేజీ ఆక్రమణ విషయంలో అధికారులు క్షేత్రస్థాయిలో మరో దఫా సమన్వయ శాఖల అధికారులతో పర్యటించి ఆక్రమణలను నిర్ధారణ చేయాలన్నారు. టింబర్ డిపో, సిద్ధార్థ స్కూల్, బాలాజీ పేట ప్రాంతాల్లో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ కుమార్, ఇన్‌చార్జి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎం.నాగలత పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: బెంగళూరులో జరిగే సౌత్ సెంట్రల్ జోన్ ఇన్స్యూరెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ 13వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాజమండ్రి డివిజన్ అధ్యక్షుడు ఎస్ఆర్‌జే మాథ్యూస్, ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ కోరారు. 'ప్రజాధనం ప్రజా వినియోగం కోసం'అనే నినాదంతో శనివారం నుంచి ఈ నెల 19వ తేదీ వరకు వీటిని నిర్వహిస్తున్నారన్నారు. మోరంపూడి లోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో గురువారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటి పరిష్కారాలు, ఎల్ఐసీలో క్లాస్ 3, 4 క్యాడర్లలో తక్షణ రిక్రూట్‌మెంట్ కోసం చేపట్టాల్సిన కార్యాచరణ, ఐఆర్‌డీఏ నిబంధనల మేరకు పాలసీదారుల ప్రయోజనాలు, సంస్థ ప్రయోజనాలు కాపాడటం ఎలా అనే అంశాలపై చర్చ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరరావు, పీఎస్ఎన్ రాజు, సత్యదేవ, జి.శ్రీనివాస్, శిరీష పాల్గొన్నారు.

14న ఉద్యోగుల మహాసభ

కడియం: రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని జేకే గార్డెన్స్‌లో డిసెంబర్ 14న జరిగే ఉద్యోగుల మహాసభను విజయవంతం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు ఆ శాఖ నాయకులు శుక్రవారం కడియం సీహెచ్‌సీని సందర్శించి ఉద్యోగులతో సమావేశమయ్యారు. జిల్లా కార్యదర్శి సీహెచ్ విల్సన్ పాల్ మాట్లాడుతూ 56 శాఖల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కేఆర్ సూర్యనారాయణ నాయకత్వంలో సంఘం పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ మాధురి హాజరయ్యారు. తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ రాజు, పి.మురళీకృష్ణ, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.శ్రీధర్, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.నాగసాయి మౌర్య, జాయింట్ సెక్రటరీ వి.ఉమ పాల్గొన్నారు.

వృద్ధుల ఆశ్రమంలో వైద్య శిబిరం



వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మూర్తి

కంబాలచెరువు: ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కమ్యూనిటీ పారామెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర వృద్ధుల ఆశ్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కార్పొరేషన్ విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ ఎంపీఆర్ మూర్తి వైద్యసేవలందించారు. ఆశ్రమంలో వృద్ధులకు షుగర్ పరీక్షలు నిర్వహించారు. దాదాపు తొంబై మందికి షుగర్ ఉన్నట్లు గుర్తించి, వారందరికీ మందులు అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ పీఎంపీలు సమాజ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకుడు గుబ్బల రాంబాబుకు మధుమేహ నిర్ధారణ పరీక్ష పరికరాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం, కోశాధికారి పి.చిన్ని, రాజమండ్రి అధ్యక్షుడు రహమాన్ ఖాన్, మట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

25వ తేదీ నుంచి 108 ఉద్యోగుల సమ్మె



తహసీల్దార్ పోసిబాబుకు వినతిపత్రం ఇస్తున్న 108 ఉద్యోగులు

కడియం: ఈ నెల 25వ తేదీ నుంచి 108 అంబులెన్స్ ఉద్యోగులు సమ్మె చేస్తున్నట్లు కడియం లోకేషన్ స్టాఫ్ వి.శ్రీమన్నారాయణ, సీహెచ్ రమేష్ బాబు, జి.రాంబాబు తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ పోసిబాబు, ఎంపీడీవోలకు గురువారం వినతి పత్రాలు అందించారు. 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. తమ సమస్యలపై ప్రభుత్వ ఉన్నతాధికారులకు అనేక దఫాలుగా వినతిపత్రాలు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నిరవధిక సమ్మెకు వెళ్లాల్సిన పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వమే కారణమని తెలిపారు.

మానవుల ఉన్నతికి పుస్తకాలే ఆధారం

- నన్నయ రిజిస్ట్రార్ సుధాకర్
- గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



ఆర్ట్స్ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభిస్తున్న నన్నయ రిజిస్ట్రార్ సుధాకర్



కడియంలో మాట్లాడుతున్న సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మి



గౌతమి గ్రంథాలయంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న డాక్టర్ గురు ప్రసాద్ తదితరులు



జూబ్లీ పబ్లిక్ లైబ్రరీలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే వాసు, చిత్రంలో ఆకుల వీర్రాజు

కంబాలచెరువు: మానవుల మేధస్సుకు పుస్తకాలే ఆధారమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ జి.సుధాకర్ అన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కేతో కలిసి గురువారం ఆయన గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. విద్యార్థులు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రామమూర్తి, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రశేఖర్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక అల్కాట్‌తోట శాఖాగ్రంథాలయంలో గురువారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎంఎస్ జెస్సీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సరస్వతీదేవి, జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి కొత్తపల్లి రమ్యశ్రీ పాల్గొన్నారు.

- ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు హాజరయ్యారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విజేత అకాడమీ డైరెక్టర్ పాలవలస బాబ్జీ మాట్లాడుతూ నేటి తరానికి గ్రంథాలయాలను సన్నిహిత చేయడమే ధ్యేయంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు.

కడియం: గ్రంథాలయాల్లో చదువుకుని తాను ఈ స్థాయికి ఎదిగానని కడియం సబ్‌రిజిస్ట్రార్ లక్ష్మి అన్నారు. కడియం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. మండల విద్యాశాఖ అధికారి ఏడిద నాగేశ్వరరావు, కడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టి. సత్యనారాయణ మాట్లాడారు.

సీటీఆర్ఐ: పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని పిల్లల వైద్య నిపుణుడు యేచూరి గురు ప్రసాద్ అన్నారు. గౌతమి ప్రాంతీయ గ్రంథాలయంలో వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి డాక్టర్ అరిపిరాల నారాయణరావు అధ్యక్షత వహించారు.

- కందుకూరి వీరేశలింగం పురమందిరం టౌన్ హాల్‌లోని జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ, రీడింగ్ రూమ్ సమాజ్ ఆధ్వర్యంలో జరిగే గ్రంథాలయ వారోత్సవాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. జూబ్లీ పబ్లిక్ లైబ్రరీ కార్యదర్శి ఆకుల వీర్రాజు ఆహ్వానం మేరకు ఈ సభకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. బీవీఎస్ మూర్తి, యర్రా వేణుగోపాలరాయుడు పాల్గొన్నారు.

సకాలంలో రోగాలను గుర్తించాలి

సీటీఆర్ఐ: సకాలంలో రోగాలను గుర్తించడం ద్వారా వెంటనే చికిత్స పొందవచ్చని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వసుంధర అన్నారు. తాడితోట అంబేడ్కర్ నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని గోరక్షణపేట 13వ సచివాలయం పరిధిలో డాక్టర్ బొడ్డేటి అశోక్ కుమార్ పర్యవేక్షణలో గురువారం ఎన్‌సీడీసీడీ 3.0 సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వసుంధర మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ గుండె, మధుమేహం, నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ల వంటి అనారోగ్యాలకు స్క్రీన్ చేస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీఎన్ఎస్ఎస్ కుమారి, ఏఎన్ఎం ఎం.సూర్యకుమారి, ఆశ వర్కర్ ఆర్.అంజియ్యమ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవం



బాలికా సదనంలో పండ్లు పంపిణీ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి



మహనీయుల వేషధారణలో డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు

సీటీఆర్ఐ: మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా గురువారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రాఘవ కుమారి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ బాలిక సదనంలో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు జక్కంపూడి విజయలక్ష్మి పండ్లు పంచిపెట్టారు.

ప్రియదర్శిని ఆశ్రమంలో..

కంబాలచెరువు: స్థానిక ప్రియదర్శిని మూగ, చెవిటి అనాథాశ్రమంలో సంహిత డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ అధ్యక్షతన కళాశాల ఏవో, ఎన్ఎస్ఎస్ పీవో గిరుతూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బాల బాలికలకు పండ్లు, చాక్లెట్లు, పెన్నులు పంపిణీ చేశారు. గిరుతూరి బాలకృష్ణ మాట్లాడుతూ పిల్లలు దైవంతో సమానమన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రముఖులు



ప్రియదర్శిని విద్యార్థులతో సంహిత డిగ్రీ కళాశాల సిబ్బంది

సంహిత డిగ్రీ కాలేజ్ కల్చరల్ హెడ్ పల్లి సురేష్, ఎన్ఎస్ఎస్ పీవో టి.భాను, కళాశాల క్యాంపస్ ఇన్‌చార్జి గోవింద్ పాల్గొన్నారు.

అలరించిన 'జోష్'

ధవళేశ్వరం: బాలల దినోత్సవం సందర్భంగా గురువారం ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్లో జోష్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 'జోష్' పేరిట జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. అనంతరం మహనీయుల వేషధారణ పోటీలు నిర్వహించారు. జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి, మదర్‌థెరిస్సా, భరతమాత వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎ.రమేష్, ప్రిన్సిపాల్ వి.సంధ్యాకుమారి, ఎన్.దీపిక, డ్రీమ్స్ ఫస్ట్ స్టెప్ ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.లలితాదేవి, టి.ప్రసన్నకుమారి, ఉపాధ్యాయులు పి.దుర్గాదేవి, ఎన్.కృప, కె.సాయిశ్రీ, ఎ.హేమసత్యవతి పాల్గొన్నారు.

కడియం: వేమగిరితోటలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల -1లో నెహ్రూ చిత్రపటానికి ఎంఈవో ఏడిద నాగేశ్వరరావు పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కె.జయరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కవలగొయ్యిలోని ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్‌లో బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సంగీతం, నృత్యం, నాటికలను ప్రదర్శించి అలరించారు. నూరుశాతం హాజరు, చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ డైరెక్టర్ యేలేటి రవిబాబు, చైర్‌పర్సన్ విజయ, సీఈవో మహశ్వి, డీన్ హర్షిణి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, వైస్ ప్రిన్సిపాల్ సైదాబాబు, శ్రీవల్లి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలపై మోపిన భారాలను తగ్గించాలి



నగరపాలక సంస్థ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సీటీఆర్ఐ: ప్రజలపై మోపిన అధిక ధరలు, విద్యుత్ భారాలను తగ్గించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలంటూ నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట గురువారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల హామీలను నెరవేర్చాలని, యువతకు ఉపాధి కల్పించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రజాపోరు కార్యక్రమం జరుగుతోందన్నారు. రాజమహేంద్రవరం నగరపాలకసంస్థకు ఎన్నికలు జరిగి పదేళ్లు పూర్తయ్యాయన్నారు. తక్షణమే ఎన్నికలు జరిపి నగరంలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి ఏటా 15 శాతం ఆస్తి పన్ను పెంచి వసూలు చేస్తూ.. కనీస సౌకర్యాలు కూడా నగరవాసులకు అందించడం లేదని విమర్శించారు. రెండుపూటలా సురక్షిత తాగునీరు అందించాలని, నూతన కుళాయి కనెక్షన్లకు రూ. 9 వేల కానెటింగ్ చార్జీలు వసూలు చేయడాన్ని తక్షణమే ఉపసంహరించాలని, కాలం చెల్లిన డ్రైనేజీలను ఆధునీకరించాలని, రోడ్లపై గుంతలను పూడ్చాలని డిమాండ్ చేశారు.